క్లుప్తంగా

వైఎస్సార్ పింఛన్ కానుక

బొల్లాపల్లి: వైఎస్సార్ పింఛన్ కానుకను మండలంలోని 17 సచివాలయాల పరిధిలో వలంటీర్ల ద్వారా పింఛన్‌ను గురువారం పంపిణీ చేశారు. మండలంలో 9090 మందికి సుమారు 2.72 కోట్ల మేర నగదు ప్రతినెల అందజేయడటం జరుగుతుందని ఎంపీడీఓ వి.ఎ.విజయకుమార్ తెలిపారు. ప్రతినెలా క్రమం తప్పకుండా నెల మొదటి రోజు జగనన్న పింఛన్ కానుక లబ్ధిదారుల చెంతకు చెరుతోందని తెలిపారు. మండలంలో మొదటి రోజు 63 శాతం పంపిణీ చేశారని తెలిపారు. మిగిలిన నేడు లబ్ధిదారులకు పంపిణీ ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ అద్దెబస్సు



యడ్లపాడు: ఆర్టీసీ అద్దెబస్సు లారీని ఢీకొనడంతో పెనుప్రమాదం తప్పింది. నెల్లూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి నెల్లూరుకు ప్రయాణికులతో బయలుదేరి యడ్లపాడు గ్రామం ఎస్ఎస్ఎల్ మిల్లు సమీపంలో ముందు వెళ్తున్న పీవీసీ పైపుల లోడు లారీని ఢీకొంది. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో లారీ వెనుకభాగం, బస్సు ముందుభాగం భారీగా ధ్వంసమయ్యాయి. బస్సు డ్రైవర్ క్యాబిన్‌లోనే ఇరుక్కోవడంతో కాళ్లకు గాయాలయ్యాయి. బస్సులో 19 మంది ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. స్వల్పంగా గాయలవ్వడంతో అందరూ దిగి ఇతర బస్సుల్లో వెళ్లిపోయారు. డ్రైవర్‌ను చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నైతిక విలువలపై పరీక్షలు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాలలో రెండురోజుల పాటు పరిసరాల విజ్ఞానం, మానవతా నైతిక విలువలపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ పరీక్షలు నిర్వహణ వల్ల విద్యార్థుల్లో ఉన్న సామర్థ్యాలను దోహద పడతాయన్నారు. ప్రశ్న పత్రాలు కూడా ఆన్‌లైన్ వస్తాయని మార్కులు ఆధారంగా కొంత మేర ఫైనల్ పరీక్షల్లో కొన్ని మార్కులు కలుస్తాయన్నారు.

సాతులూరులో ఘనంగా ఘటం ఊరేగింపు



నాదెండ్ల: సాతులూరులో గ్రామ దేవతల ఆలయాల తొమ్మిదవ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం రెండో రోజు ఘటం (కుండ) ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు ఘటం కుండతో సాంప్రదాయబద్ధ మేళతాళాలతో ఉదయం 6–9 గంటల వరకు గ్రామోత్సవంతో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం సద్దిని సమర్పించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

రేపు సచివాలయం, ఆర్బీకే భవనాలు ప్రారంభం



నార్నెపాడు(ముప్పాళ్ళ): నార్నెపాడు గ్రామంలో ఈ నెల 3న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించనున్నారు. రూ.40 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో ఆర్బీకే భవనం, రూ.20.8 లక్షలతో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఆయన ప్రారంభించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు తెలిపారు.

సచివాలయంలో డిజిటల్ సేవలపై అవగాహన



అచ్చంపేట: గ్రామ సచివాలయాల్లో డిజిటలైజేషన్ ద్వారా త్వరితగతిన అందుతున్న సేవలను గురువారం స్థానిక గురుకుల పాఠశాల, కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు కట్టా శివన్నారాయణ వారికి సచివాలయ వ్యవస్థ ద్వారా ఎలాంటి సేవలు అందుతున్నాయో వివరించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీని పరిశీలించారు. వారి వెంట పాఠశాల ప్రిన్సిపల్ టి.అరుణ్‌కుమార్, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎ.సుబ్బారావు ఉన్నారు.

జగనన్న పాలనలో సామాజిక న్యాయం



మాట్లాడుతున్న మల్లెల రాజేష్‌నాయుడు, పార్టీ నాయకులు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నారని... సామాజిక సాధికారితను చేతల్లో చూపిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. నరసరావుపేట లోక్‌సభ పార్టీ సమన్వయకర్తగా పోలుబోయిన అనీల్‌కుమార్ యాదవ్‌ను నియమించటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మల్లెల రాజేష్ నాయుడు మాట్లాడుతూ కుల, మత, ప్రాంత బేధాలు లేకుండా జగనన్న అన్ని వర్గాలకు అవకాశం కల్పిస్తున్నారని కొనియాడారు. 2019 ఎన్నికలలో తెలుగు రాష్ట్రాల చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖితమయ్యేలా 151 స్థానాల్లో విజయం సాధించి వైఎస్సార్ సీపీ జగనన్న నాయకత్వంలో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు సామాజిక సాధికారితకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రివర్గంలో బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ మంత్రులకు అవకాశం కల్పించటంతో పాటు నగర పాలక సంస్థ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, సొసైటీల చైర్మన్లుగా అందరికీ మెండుగా అవకాశాలు ఇచ్చారని కొనియాడారు. క్రమంలో నరసరావుపేట పార్లమెంట్ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా పోలుబోయిన అనీల్‌కుమార్ యాదవ్‌ను నియమించటం సంతోషించదగ్గ విషయమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ఇతర పార్టీ నరసరావుపేట పార్లమెంటు పరిధిలో బీసీలకు అవకాశం కల్పించలేదని... నేడు ఆ ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో నరసరావుపేట పార్లమెంటు పరిధిలోని ఎంపీ, ఏడు ఎమ్మెల్యేలు అత్యధిక మెజార్టీతో గెలువబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ దేవినేని శంకరరావు, చిలకలూరిపేట, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు కోడే సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్ –1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్ –2 విడదల కమలేంద్ర, కార్యదర్శి మారుబోయిన నాగరాజు, పార్టీ మండల అధ్యక్షులు గుత్తా యాములయ్య, ఘంటా శంకర్, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సిరాజ్, నాయకులు బేరింగ్ మౌలాలి, కందుల శ్రీకాంత్, గుంజి వీరాంజనేయులు, నకరికంటి శ్రీకాంత్, తాళ్ల అంజిరెడ్డి, బి.బాలకోటినాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోండి

- నేడు సొలస గ్రామంలో ఉచిత వైద్యశిబిరం
- జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం



యడ్లపాడు: గ్రామీణ వాసులకు ఉన్న ఊరిలోనే మెరుగైన వైద్యం అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతేడాది ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష అంతటా విజయవంతమైంది. తిరిగి ఈ ఏడాది ఆరంభం నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 పేరుతో మరోమారు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. జనవరి 5 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఏప్రిల్ 12వ తేదీ వరకు కొనసాగుతుంది. క్యాంపెయిన్‌లో భాగంగా వైద్యబృందం ఇంటింటి సందర్శన, అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించడం, ప్రతి గ్రామంలో వైద్యశిబిరాల ఏర్పాటు చేయడం, చికిత్సలు, మందులు ఉచితంగా అందించడం అవసరమైన వారికి పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయడం వంటి వాటికి ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఇప్పటికే మండలంలో జనవరి 5న చెంఘీజ్ ఖాన్‌పేట, 12న తుర్లపాడు, 19న కొండవీడు గ్రామాల్లో నిర్వహించడం జరిగింది. తాజాగా శుక్రవారం సొలస గ్రామంలో ఈ క్యాంపెయిన్ ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు స్థానిక ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు ఎం.ప్రభాకరరావు, భరద్వాజ తెలిపారు. ఈ శిబిరంలో ఐదుగురు వైద్యులు హాజరుకాగా వీరిలో ఇద్దరు స్పెషలిస్టులు, మరొకరు కంటి వైద్యులు పాల్గొంటారు. ముఖ్యంగా స్త్రీలకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన వారు ఒకరు అందుబాటులో ఉంటారన్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 565 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు, చికిత్స అందించామన్నారు. అలాగే 33మంది రోగులకు శస్త్ర చికిత్సలు అవసరం కాగా వారిని నెట్‌వర్క్ ఆస్పత్రికి సిఫార్సు చేయగా, 298 మందికి కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందించడం జరిగిందన్నారు.

దీర్ఘకాలిక రోగాలకు మెరుగైన వైద్యసేవలు

- జగనన్న సురక్ష వైద్యశిబిరాలతో ఎంతో ఉపయోగం
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యం.రాధాకృష్ణన్



శావల్యాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా దీర్ఘకాలిక రోగులకు మెరుగైన వైద్య సేవలు సకాలంలో పారదర్శకంగా అందుతున్నాయని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యం.రాధాకృష్ణన్ వెల్లడించారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య మొదటి విడతలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను 3717 మందికి వైద్య సేవలు అందించటం ద్వారా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈక్రమంలో ప్రభుత్వం మళ్లీ ఫేజ్–2 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదల వైద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపటం ద్వారా షుగర్, బీపీ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు గ్రామాల్లోని ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెజ్‌పీల పర్యవేక్షణలో నేరుగా వారి ఇళ్లను సందర్శించి నిరంతరం వైద్య సేవలు అందించటంతో పాటు ఆరోగ్య సూత్రాలు వివరించటం ద్వారా చాలా మేలు జరుగుతోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 14 రకాల వైద్య పరీక్షలు, గర్భ నిర్ధారణకు యూరిన్, హిమోగ్లోబిన్, షుగర్, మలేరియా, హెచ్ఐవీ టెస్ట్, డెంగ్యూ, మల్టీపిరీ యూరిన్, అయోడిన్ టెస్ట్, వాటర్ టెస్టింగ్, హెపటైటిస్ టెస్టింగ్, ఫైలేరియాసీస్, సిఫ్లిస్ ర్యాపిడ్ టెస్ట్, విజువల్ ఇన్‌స్పెక్షన్, స్పుటమ్ వంటి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. వైద్య ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి, కిడ్నీ, కొవ్వు శాతం తదితర వైద్య పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు అత్య వసరమైన రోగులకు ఉచితంగా కార్పొరేటు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింద న్నారు. ఆరోగ్యశ్రీ కార్డు నూతనంగా రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఫేజ్– 2లో ఐదు గ్రామ సచివాలయాలు పూర్తి కాగా ఇప్పటి వరకు 1600 మందికి వైద్య సేవలు అందించామన్నారు.

ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు ప్రభుత్వ నియమించగా ఒకరు ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమం హాజరవుతారన్నారు. మరొకరు వైద్యశాలలో ఉంటారన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ఆరోగ్య కోసం ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి శుభ పరిణామమన్నారు. ఆయనతో పాటు స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మీప్రసన్న, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

18 రకాల చేతివృత్తుల వారికి ప్రయోజనం

పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించిన విశ్వబ్రాహ్మణ సంఘం



కేఎల్ఎస్ రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

నరసరావుపేట: పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా 18 రకాల చేతివృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం, బ్యాంకు నుంచి ఆర్థిక సహాయం లభిస్తుందని, వినియోగించుకొని ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగాలని ఐఐడీయస్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.ఎల్.యస్.రెడ్డి అన్నారు. గురువారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవీ కల్యాణ మండపంలో ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ సారథ్యంలో పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి మొత్తం 200 మంది చేతివృత్తుల వారు పాల్గొని విశ్వకర్మ పథకం ప్రయోజనాలు తెలుసుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వి.వెంకటేశ్వరరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస రాంప్రసాద్, , ఏపీ ఎంఎస్ ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భీమవరం విజయలక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవ్‌రావు, ఆర్టిసన్ సెల్ కన్వీనర్ హనుమయ్య, పల్నాడు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సుతారం వాసు, ప్రధాన కార్యదర్శి బొప్పూడి సాయి ప్రసాద్, కోశాధికారి వేములూరి రాంబాబు, కమిటీ సభ్యులు బంగారు బాబు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ షాపులో విజిలెన్స్ తనిఖీలు

రూ.4.45 లక్షల విలువైన ఎరువుల విక్రయాలు నిలుపుదల



తనిఖీచేస్తున్న విజిలెన్స్, వ్యవసాయాధికారులు

నరసరావుపేట రూరల్: మండలంలోని కొండకావూరు గ్రామంలో గురువారం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు వ్యవసాయ సిబ్బందితో కలసి శ్రీరామకృష్ణ ఎంటర్ ప్రైజెస్ పెస్టిసైడ్స్ షాపులో తనిఖీలు చేశారు. వ్యవసాయ శాఖ వారి నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా, రికార్డులు లేకుండా ఫెర్టి లైజర్స్ విక్రయిస్తున్నట్లు గమనించారు. గుంటూరు రీజినల్ ఎన్‌ఫోర్సుమెంట్ విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన దాడుల్లో రెండు కంపెనీలకు చెందిన ఎరువుల స్టాక్ లైసెన్స్‌లో లేనివిగా కనుగొన్నారు. షాపులోని రూ.4.45 లక్షల విలువైన 20 మెట్రిక్ టన్నుల ఫర్టిలైజర్ల అమ్మకాలను నిలుపుదల చేశారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం



ప్రేమ్‌చంద్‌కు ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

యడ్లపాడు: జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు అవసరమైనందున మండలంలోని ఉన్నవ ఉదయపురి కాలనీకు చెందిన అల్లడి ప్రేమ్‌చంద్‌కు పలువురు రూ.24 వేల ఆర్థికసాయం అందించారు. ఏఎన్‌యూలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్న ప్రేమ్‌చంద్ అథ్లెటిక్స్ పట్ల మంచి ఆసక్తితో పాటు మండల, జిల్లాస్థాయిల్లో జరిగిన రన్నింగ్ పోటీల్లో అనేక బహుమతులు సాధించాడు. తాజాగా ఆల్‌ఇండియా యూనివర్సిటీ మీట్ అథ్లెటిక్స్‌లో టాప్–10 జాబితాలో నిలిచాడు. త్వరలో మహారాష్ట్రలో జరిగే ఈ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనున్నాడు. తన ఆర్థిక ఇబ్బందుల్ని గమనించిన ఉన్నవ డాట్.కామ్, జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు కె.హిమ బిందు, తోకల సాంబయ్య, చెన్నుపాటి సుబ్బారావు, గల్లా శ్రీనివాసరావు, ముక్తా ప్రభాకర్, కస్తూరి, అజరయ్య, సామినేని కోటేశ్వరరావు, కుర్రా వేణు, జాష్టి శివరామకృష్ణ ఈ ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు.

నూతన ఎంపీడీవోలు వీరే...



విజయకుమార్

బొల్లాపల్లి: మండల నూతన ఎంపీడీఓగా వి.ఎ.విజయకుమార్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నూజివీడు మండలం నుంచి బొల్లాపల్లి మండలానికి బదిలీపై వచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు జరిగాయని ఎంపీడీఓ వెల్లడించారు.

యడ్లపాడుకు..



వై శ్రీనివాసరావు

యడ్లపాడు: మండల నూతన ఎంపీడీవోగా వై.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ రాజ్‌శాఖలో జరుగుతున్న బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న వై.హనుమారెడ్డి ప్రకాశం జిల్లా బల్లికురవ మండలానికి బదిలీపై వెళ్లగా అదే జిల్లాలోని మద్దిపాడు మండలంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

శావల్యాపురం...



కవితా చౌదరి

శావల్యాపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) కొర్రపాటి కవిత చౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య ప్రకాశం జిల్లా కురిచేడు మండలానికి బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీవోను ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, కార్యాలయ సిబ్బంది పరిచయ కార్యక్రమంతో పాటు అభినందనలు తెలిపారు.

హైస్కూల్‌లో డిప్యూటీ డీఈవో తనిఖీలు



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న వేణుగోపాల్

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం నడిగడ్డ గ్రామంలోని సుప్రభాత్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పల్నాడు జిల్లా ఉపవిద్యాశాఖాధికారి వేణుగోపాల్ వార్షిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు పరిశీలన అనంతరం మధ్యాహ్న భోజనం, విద్యార్థినీ విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. 10 తరగతి విద్యార్థుల పరీక్షల దృష్ట్యా ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి మార్కులు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమంత్ కుమార్ ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాఠశాల ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాణి ట్రస్టు సారథ్యంలో ఆలయాల నిర్మాణం



ఇళ్లపట్టాలు స్వీకరించిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, పురోహిత సంఘ ప్రతినిధులు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలోని పలుచోట్ల వాణి ట్రస్టు నిధుల ద్వారా ఆలయాల నూతన నిర్మాణం, మరమ్మతులు చేపట్టామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని శ్రీ పట్టాభి రామస్వామి దేవస్థానంలో శ్రీ వాగ్దేవి స్మార్త పురోహిత సంఘం నూతన అధ్యక్ష, కమిటీ ప్రమాణ స్వీకారం మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 1500 దేవస్థానాలు శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మించడం జరిగిందన్నారు.

అదేవిధంగా పట్టణం, వివిధ గ్రామాలైన ఇసప్పాలెం, కోటప్పకొండ, విప్పర్లపల్లి, సంతగుడిపాడు, విప్పర్లరెడ్డిపాలెం, మరిచెట్టుపాలెం, రొంపిచర్లలో ఆలయాలు మరమ్మతులు, నూతన నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కోటప్పకొండలో అతిథి గృహం నిర్మాణం కోసం రూ.2 కోట్లతో త్వరలో టెండర్లు పిలవటం జరుగుతుందన్నారు. పట్టణంలోని 37 మంది పురోహితులకు మంజూరుచేసిన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. త్వరలో మరో 60 మందికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పురోహితుల సంఘం విన్నపం మేరకు అసోసియేషన్ భవనం నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకు రావా లని కోరారు. కొప్పురావు పురుషోత్తమ రావు, భాగవతుల లక్ష్మీనారాయణ (దుర్గ బాబు), రొంపిచర్ల ఆంజనేయులు, సుబ్రహ్మణ్య శాస్త్రి, సాంబశివశాస్త్రి, దిలీప్ కుమార్, గోపాల కృష్ణమూర్తి, వెంకట్రామయ్య, చంద్రశేఖర్ శర్మ పాల్గొన్నారు.

నూతన అధ్యక్షులుగా మేళ్లచెరువు కుమార్

స్మార్త పురోహిత సంఘ నూతన అధ్యక్షులుగా మేళ్లచెరువుకుమార్, ప్రధాన కార్యదర్శి కూచిభట్ల మహేష్, రంగావఝ్జుల నాగవర్ధనశాస్త్రితో పాటు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి, కార్యనిర్వాహక అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు నూతనంగా ప్రమాణ స్వీకారం చేశారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛను చేతికిచ్చి...



ప్రభుత్వం పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతినెలా 1వ తేదీన పంపిణీ చేయడం సర్వసాధారణం. అయితే అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న పింఛనర్లకు సైతం హాస్పిటల్‌కు వెళ్లి మరీ పింఛను అందిస్తుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దూపాటి రాజారావు అనారోగ్యంతో వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. గ్రామానికి చెందిన వలంటీరు డి. రాజీవ్ వినుకొండ ఆస్పత్రికి వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. దీంతో మాజీ సర్పంచ్ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ విధానంపై అభినందనలు తెలియజేశారు.

–వినుకొండ(నూజెండ్ల)

గుంటూరు జీజీహెచ్‌కు వెళ్ళి...



మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో గురువారం సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం తెల్లవారుజామునే ప్రారంభమైంది. వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి పింఛను అందించారు. మండల పరిధిలో తొలిరోజు 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. గణపవరం రాజీవ్‌గాంధీకాలనీలో నివాసం ఉండే మండపాటి పుల్లయ్య అనారోగ్య కారణంగా గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న సచివాలయ వలంటీర్ కోట అన్నమ్మ గుంటూరు జీజీహెచ్ చేరుకుని రూ.3 వేలు వృద్ధాప్య పింఛను అందించారు. దీంతో లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

–నాదెండ్ల

రహదారికి మరమ్మతులు



వినుకొండ నుంచి గుంటూరు వరకు జాతీయ రహదారి మార్గంలో ప్యాచ్ వర్క్ పనులు చేస్తున్నట్లు డీఈ బండి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. మార్గంలో ఎక్కడా గుంతలు లేకుండా వాహనదారులు ఇబ్బందులు పడకుండా ఉండటానికి రూ. 3 కోట్ల వ్యయంతో రహదారి మార్గంలో ప్యాచ్ పనులు చేస్తున్నట్లు చెప్పారు. వినుకొండ నుంచి గుంటూరు వరకు 97 కిలోమీటర్ల మేర ఆధునికీకరణ యంత్ర పరికరాల సహాయంతో పనులు వేగవంతంగా చేస్తున్నట్లు డీఈ తెలిపారు. నాణ్యాత ప్రమాణాలు లోపించకుండా ఉండటానికి నిరంతరం అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు ఏఈ ప్రకాష్, ఇతర సిబ్బంది ఉన్నారు.

– శావల్యాపురం